AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

రోడ్డు మీదే రోడ్డేస్తున్నారు..

2

2

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య..

ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

అక్షర టుడే, ఎల్లారెడ్డి: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో విజయ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఈనెల 8న జాబ్‌మేళా ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. మేళాలో భాగంగా సేల్స్ రిప్రజెంటెటివ్స్, గ్రూప్ లీడర్, సేల్స్ మేనేజర్ పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, డిగ్రీ విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు శివకుమార్ (9346708846), రాజు (9951479110)ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

తాగునీటికి తిప్పలు

కామారెడ్డి ప్రజలు తాగునీటికి అరిగోస పడుతున్నారు. మూడు రోజులకొకసారి నీళ్లు వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు మాత్రం జిల్లా కేంద్రమే.. అయినా పట్టణంలో నీటి కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఏళ్ల తరబడి ఉన్న సమస్య శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ప్రజల తాగునీటి కష్టాలు మాత్రం మారడం లేదు. పైగా నీటి కోసం కూడా రాజకీయాలు చేసే దుర్భర పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు రావడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

- నత్తనడకన అమృత్ 2.0 పనులు
- ముందుకు సాగని పైప్‌లైన్ నిర్మాణాలు
- గొంతు తడపని గోదావరి
- కామారెడ్డి ప్రజల ఇబ్బందులు

కామారెడ్డి 2016 అక్టోబర్‌లో జిల్లా కేంద్రంగా మారింది. జిల్లా కేంద్రమై ఏడున్నరేళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం మామూలు మున్సిపాలిటీలో అన్నట్టుగానే ఉన్నాయి. ఇక్కడి ప్రజలు నీళ్లు లేక అల్లాడుతున్నారు. ఏళ్ల తరబడి తాగునీటికి కష్టాలు పడుతూనే ఉన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసినా దేనికి సరిపోవడం లేదు. అసలే ఎండాకాలం తీవ్రమవుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజల దాహార్తి తీరే మార్గాలు కనిపించడం లేదు. పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తొలగించేందుకు గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు అమృత్ 2.0 కింద రూ.93 కోట్లతో మొదలైన పనులు మందకొడిగా సాగుతున్నాయి. దాంతో వేసవి ముగిసే లోపైనా పనులు పూర్తవుతాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నిధులున్నా..

పట్టణాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద ప్రత్యేక నిధులు కేటాయించింది. కామారెడ్డి మున్సిపాలిటీకి రు.93 కోట్లు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పనులు చేపట్టాల్సి ఉన్నా ఆచరణకు నోచుకోలేదు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు ప్రారంభం కాగా.. ఒక అడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్నట్టుగా పనులు సాగుతూనే ఉన్నాయి. పైప్‌లైన్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా కోసం 102 కిలోమీటర్ల పైప్ లైన్ వేయాల్సి ఉండగా ఇప్పటివరకు దాదాపు 50 కిలోమీటర్ల పైగా మాత్రమే పూర్తయినట్టుగా తెలుస్తోంది. ఇంకా సగం వరకు పైప్ లైన్ వేయాల్సి ఉంది. పైపులు సరఫరా ఆలస్యం కావడం వల్ల పైప్ లైన్ పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

నీటి ఎద్దడి తప్పేనా..

కామారెడ్డి పట్టణానికి ప్రస్తుతం కామారెడ్డి పెద్ద చెరువు, మల్లన్నగుట్ట నుంచి నీటి సరఫరా కొనసాగుతోంది. ఆ నీరు అనుకున్నంతగా రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయినా పట్టణంలో నీటి కొరత తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం ఏర్పడినా ఇప్పటికి తాగునీటి సమస్యపై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. ప్రత్యేక సమావేశం నిర్వహించి తాత్కాలికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఈ వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. తాగునీటి సంక్షోభం నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

35 శాతం పనులే పూర్తి

కామారెడ్డి పట్టణానికి తాగునీటి సరఫరా కోసం గోదావరి జలాలను మల్లన్నగుట్ట నుంచి తరలించాల్సి ఉంది. మల్లన్నగుట్ట నుంచి కామారెడ్డి పట్టణంలోని ఫిల్టర్ బెడ్ వరకు, అక్కడి నుంచి పైప్ లైన్ ద్వారా ట్యాంకులకు సరఫరా చేయనున్నారు. రూ.93 కోట్లతో చేపడుతున్న ఈ పనులు ఇప్పటికి కేవలం 35 శాతం మాత్రమే పూర్తయినట్టుగా తెలుస్తోంది. మార్చి చివరి వరకు పూర్తి చేస్తామని అధికారులు చెప్పినా ఇప్పటికి సగం కూడా పనులు పూర్తి కాకపోవడానికి పైపులు సరఫరా, సబ్ కాంట్రాక్టర్ మారడం కారణమని తెలుస్తోంది.

డిసెంబర్ వరకు పూర్తి

అమృత్ 2.0 కింద రూ.93 కోట్లతో చేపట్టిన పైప్ లైన్, ట్యాంకుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికి 50 కిలోమీటర్ల మేర పైప్ లైన్ పూర్తయింది. 9 ట్యాంకులకు 7 ట్యాంకుల గ్రౌండ్ పూర్తయ్యాయి. వారంలో మరొక రెండు ట్యాంకుల నిర్మాణం ప్రారంభం కానుంది. పైపులు సరఫరా సరైన సమయానికి రాకపోవడం, సబ్ కాంట్రాక్టర్ మారడంతో పనులు ఆలస్యం అయ్యాయి. డిసెంబర్ చివరి వరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

– సంతోష్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండలంలోని అన్నాసాగర్, ఆజామాబాద్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వేసవి దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో సకాలంలో వరికొనుగోళ్లు చేపట్టాలన్నారు. అనంతరం వెనువెంటనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ ప్రేం, ఐకేపీ సీసీ పాల్గొన్నారు.

గోనె సంచులు, లారీల కొరత లేకుండా చూడాలి: పోచారం

అక్షరటుడే, కోటగిరి : కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, లారీల కొరత లేకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులు, సొసైటీ పాలకవర్గ సభ్యులకు సూచించారు. పోతంగల్‌లోని విశాల సహకార పరపతి సంఘంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు తెచ్చిన ఎండిన ధాన్యాన్ని వెనువెంటనే కాంటాలు చేయాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రకం రూ. 2,389 కామన్ గ్రేడ్ రకం రూ.2,369 ఉంటుందన్నారు. వర్షా లు పడే సూచనలు ఉన్నా కూడా రైతులు ధైర్యంగా భగవంతుడి మీద నమ్మకంతో ధాన్యాన్ని కోసి ఆరబెట్టారన్నారు. ఎక్కడా కూడా గోనెసంచులు, లారీల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. రాత్రయినా సరే లారీలు తీసుకొని వచ్చి కాంటలు చేయించాలని సెక్రెటరీ, సహకార సంఘం సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్, కల్లూరి సంధ్య హన్మాండ్లు, ఎంపీడీవో చందర్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్, పీఏసీ ఇన్‌ఛార్జి చైర్మన్ రియాజుద్దీన్, ఏవో నిషిత, సర్పంచులు, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో షేక్ సలాం, మరో అధికారి రజాక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది రెగ్యులర్ జరిగే తనిఖీల్లో భాగంగా వారు కళాశాలను సందర్శించారు. అనంతరం షేక్ సలాం మాట్లాడుతూ.. కళాశాలకు ఎలాంటి అవసరాలున్నా వెంటనే తనను సంప్రదించాలన్నారు. కళాశాల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసా చారి, జూనియర్ అసిస్టెంట్ బుదయ్య, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్‌తో వివరాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎల్లారెడ్డిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సైతం పర్యవేక్షించారు.

రోడ్లపై పంట ఉత్పత్తులు ఆరబెట్టవద్దు

అక్షరటుడే, మెండోరా: మండలంలోని రహదారులపై పంట ఉత్పత్తులను ఆరబెట్టడం ప్రమాదాలకు దారితీస్తుందని ఎస్సై సుహాసిని హెచ్చరించారు. మొక్కజొన్న, వరిధాన్యం తదితర పంటలను రోడ్లపై ఆరబెట్టడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరిగిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. ప్రయాణానికి వినియోగించే రహదారులను పంటలు ఆరబెట్టేందుకు ఉపయోగించకూడదని, ఇలా చేస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. రోడ్లపై పంటలు ఆరబెట్టడం వల్ల జరిగే ప్రమాదాలకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు. ప్రజలు భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారులను సురక్షితంగా ఉంచాలని సూచించారు.

ధర్మపురి సంజయ్‌కి పదవి ఇవ్వాలని నిరాహార దీక్ష

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మాజీ మంత్రి డీఎస్ తనయుడు, నిజామాబాద్ నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్‌కు పదవి ఇవ్వాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్నసంజయ్‌కి గుర్తింపు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆయన అభ్యర్థుల గెలు పు కోసం విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి పదవి ఇవ్వాలని వారు కోరారు. ధర్మపురి సంజయ్ ఏ పార్టీలో ఉన్నా తాము ఆయన వెన్నంటే ఉంటామన్నారు. కాగా.. కాంగ్రెస్ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ దీక్ష శిబిరానికి చేరుకుని.. నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో అన్నివర్గాల వారికి సమాన న్యాయం జరుగు తుందన్నారు. నాయకులు పార్టీ కోసం చేసిన కృషిని గుర్తించి అధిష్టానం సరైన సమయంలో పదవు లు సమకూర్చుతుందన్నారు. దీక్షలో సంజయ్ అభిమానులు ఆకుల చిన్న రాజేశ్వర్, వెంకటేష్, కపిల్, పుప్పాల భాజన్న, సక్కి విజయ్, పుప్పాల విజయ, సందీప్, రణధీర్, రింపు పాల్గొన్నారు.

నగరంలో 'జస్టిస్ ఫర్ సంజయ్' పేరుతో వెలిసిన ఫ్లెక్సీలు

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఉదయం 'జస్టిల్ ఫర్ సంజయ్' పేరుతో ఫ్లెక్సీలు వెలిశాయి. నిజామాబాద్ యువత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సోదరుల పేర్లతో కూడిన ఈ ఫ్లెక్సీల్లో డి.సంజయ్ వెంటే తాము ఉంటాయని.. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలోనే తాముంటామని పేర్కొన్నారు. అయితే తాజాగా వెలిసిన ఫ్లెక్సీల అంశం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

జీవదాన్ పాఠశాలలో అలరించిన 'కిండర్‌గార్టెన్'

అక్షరటుడే, ఎల్లారెడ్డి: కిండర్‌గార్టెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలను జీవదాన్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్న పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్నందుకు గుర్తింపుగా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా కిండర్‌గార్టెన్ గ్రాడ్యుయేషన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పిల్లలు గ్రాడ్యుయేషన్ గౌన్లు, టోపీలు ధరించి, తమ ప్రతిభను ప్రదర్శించారు. వేడుకల్లో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వారు నేర్చుకున్న అంశాలను చెబుతూ చేసిన ప్రతిభ కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహేష్, వార్డుల కౌన్సిలర్లు చిన్నారుల ప్రదర్శనలు తిలకించి ప్రశంసించారు. అనంతరం పిల్లలకు డిప్లొమాలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవదాన్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి: ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిత్యం వాహనాలు నడిపే డ్రైవర్లు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా మోపాల్ పోలీస్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్, జీజీహెచ్ నిజామాబాద్ సహకారంతో మోపాల్‌లో డ్రైవర్లకు కంటి, చెవి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మస్తాన్ అలీ మాట్లాడుతూ.. భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు ఎల్లప్పుడూ కంటి, చెవి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యం బాగుంటేనే వాహనాలు సక్రమంగా నడపగలుగుతామని వివరించారు. శిబిరంలో సుమారు 80 మంది డ్రైవర్లు, 30 మంది మోపాల్ గ్రామస్థులకు వైద్యులు అమర్‌దీపిక, శ్రవంతి, లయన్స్ క్లబ్ బృందం సభ్యులు చెవి, కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలువురు డ్రైవర్లకు కళ్లద్దాలు సైతం అందజేశారు. కార్యక్రమంలో సౌత్ రూరల్ సీఐ సురేష్, మోపాల్ ఎస్సై సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అక్షరటుడే, బాన్సువాడ: యాప్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక గృహ నిర్మాణదారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను సరఫరా చేసేందుకు ప్రభుత్వం 'మన ఇసుక - వాహనం' ఆన్‌లైన్ విధానాన్ని అమలుపరుస్తోంది. ఈ విధానంలో భాగంగా, ఇసుక అవసరమున్న వినియోగదారులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం (http://tgmiv.cgg.gov.in)లో లాగిన్ అవ్వాలి. అనంతరం సంబంధిత పంచాయతీ సెక్రెటరీ దరఖాస్తును పరిశీలించి తహశీల్దార్‌కు పంపుతాడు. తహశీల్దార్ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారు. అనుమతి వచ్చిన తరువాత దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో చెల్లింపు చేయాల్సి ఉంటుంది. అనంతరం, అనుమతి పొందిన ఇసుక అమ్మకం జరిగే ప్రాంతానికి ట్రాక్టర్‌తో వెళ్లి, సంబంధిత అధికారికి తనకు వచ్చిన క్యూఆర్ కోడ్‌ను చూపించి ఇసుకను నింపుకొని వెళ్లవచ్చు. ప్రభుత్వ అవసరాల కోసం ఇసుకను సంబంధిత ప్రభుత్వ ఇంజినీరింగ్ అధికారి దరఖాస్తును ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంటుంది.



సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'ఫేర్‌వెల్ డే'

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. స్థానిక క్షత్రియ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ రాజారాం యాదవ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో కళాశాల దశ ఎంతో కీలకమైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్ నవీన్ యాదవ్, పరిపాలన అధికారి రాకేష్, అధ్యాపకులు బాలరాజ్, అర్వింద్, రాజశేఖర్, రజనీకాంత్, ప్రమోద్, అర్చన, సుమలత, నవనీత, నిఖిత, అపూర్వ, హర్షవర్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లికొండలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

అక్షరటుడే, భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను శనివారం బీజేపీ పాలకవర్గ సభ్యులు భూమిపూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్ పిండి మనీషా అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలయ్య, వార్డు సభ్యులు గంగాధర్, రాజేష్, వీడీసీ అధ్యక్షులు లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీమ్‌గల్ మండల నాయకులు కన్నె సురేందర్, జేజే నర్సన్న, పురాణిపేట సర్పంచ్ దేవేందర్, కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు కిషన్, గంగాధర్, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అక్షరటుడే, మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి, మామిడిపల్లి గ్రామాల్లో ఉచిత గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. పశు వైద్యాధికారి ఉమాసాహీర్ సమక్షంలో పశువులకు టీకాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో పశువులకు సమయానికి ఆహారంతో పాటు తాగునీటిని అందించాలని పాడి రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుపై వేసిన బీటీ రోడ్డు..

రోడ్డు మీద రోడ్డేస్తున్నారు..

■ ఆర్మూర్ పట్టణంలో ఇష్టారాజ్యంగా పనులు..
■ పర్యవేక్షణ మరిచిన బల్దియా అధికారులు ■ అభివృద్ధి పనులు అస్తవ్యస్తం

మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ఈ నిధులతో బల్దియా పరిధిలో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అయితే ఆర్మూర్ మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగమవుతున్నాయి. వేసిన రోడ్డుపైనే మళ్లీ రోడ్లు వేస్తూ నిధులను నీళ్లపాలు చేస్తున్నారు.

– అక్షరటుడే, ఆర్మూర్

మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగానిధులు కేటాయించింది. ఈ మేరకు ఆర్మూర్ బల్దియాకు ఇటీవల రూ. 18.40 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో ఆర్మూర్ పట్టణంలో మురికి కాల్వలు, కల్వర్టులు, వరద కాల్వలు, బీటీ రోడ్డుల నిర్మాణాలకు గాను కాలనీల వారీగా నిధులు కేటాయించారు. వీటిని మట్టిరోడ్లు ఉన్నచోట కొత్త రోడ్లు, డ్రెయినేజీలు లేనిచోట్ల కొత్తగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

వేసిన రోడ్డుపైనే మళ్లీ రోడ్డు..

చాలా కాలనీల్లో ఇటీవల లక్షలు వెచ్చించి వేసిన సీసీ రోడ్లపైనే తిరిగి బీటీ రోడ్లను వేయడం గమనార్హం. పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపం ముందు భాగంలో లోటస్ స్కూల్ నుంచి శ్రీ కన్వెన్షన్ హాల్ వరకు ఇటీవల ఆర్నెళ్ల క్రితమే సీసీ రోడ్లు నిర్మించారు. కాగా.. ప్రస్తుతం అదే సీసీ రోడ్డుకు ఇరువైపులా కంకర నింపి రోడ్డును వెడల్పు చేసి నూతనంగా బీటీ రోడ్డు వేశారు. అదేవిధంగా అంగడి బజార్, మహాలక్ష్మి, కాలనీ మామిడిపల్లి, జర్నలిస్ట్ కాలనీ, కింది బజార్, మీది బజార్ ప్రాంతాల్లో సీసీ రోడ్లపై బీటీ రోడ్లు వేశారు.

గతంలో ఉన్న సిమెంట్ రోడ్డు..

కొన్ని కాలనీల్లో మట్టి రోడ్లే దిక్కు..

కొన్ని కాలనీలో రోడ్లులేక ప్రజలు నానా అవస్థలు పడున్నారు. ఈ కాలనీలను పట్టించుకోని అధికారులు ఇలా కొన్ని కాలనీల్లో ఉన్న రోడ్లపైనే కొత్త రోడ్లు వేయించడంపై సర్వత్రా విస్మయానికి గురి చేస్తోంది. వర్షాకాలం అయితే కొన్ని కాలనీల్లో రోడ్లన్నీ చిత్తడి అవుతున్నాయి. అలాంటి కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు ఇలా ప్రభుత్వ నిధులను వృథా చేయడం ఏమిటని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిధులను సక్రమంగా కేటాయించాలి..

ప్రభుత్వం కేటాయించిన నిధులను మున్సిపల్ అధికారులు సక్రమంగా వినియోగించాలి. ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లపై బీటీ రోడ్లు వేయడం సరైన పద్ధతి కాదు. రోడ్లు అసలే లేని కాలనీల్లో రోడ్లు ఏర్పాటు చేయాలి. ఇటీవల ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు సైతం నాసిరకంగా ఉన్నాయి.

– పూజ నరేందర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు

మౌలాన్‌ఖేడ్‌లో ఉచిత పశువైద్య శిబిరం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామంలో ఉచిత గర్భకోశ పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. శిబిరంలో 50 పశువులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్చన మాట్లాడుతూ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిరుపతి, గోపాలమిత్ర మహబూబ్, సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి

అక్షరటుడే, లింగంపేట: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యను శనివారం హైదరాబాద్ లో ఆర్‌టీఐ రాష్ట్ర కార్యదర్శి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అకృత్యాలు, దాడులు, కుల దూషణ, ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలను పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద ఇష్టారాజ్యంగా జెండాలు, ఫ్లెక్సీలు కట్టి ఆయనను అవమానిస్తున్నారన్నారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా సివిల్ రైట్స్ కార్యక్రమాలు జిల్లాలోని మండల, గ్రామస్థాయిలో జరిగే విధంగా చూడాలని కోరారు. కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు.

కమ్మర్‌పల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్పులూరు గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకేట్ రవి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకేట్ రవి ఆధ్వర్యంలో కొత్త పల్లి దేవికి రూ.32,000, కొమ్ముల రాజకుమార్‌కు రూ.13,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు.

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పొదుపు చేయడం నేర్చుకోవాలి..

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పొదుపు చేయడం నేర్చుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ అధికారులు విజయ్ కుమార్, కృష్ణవేణి అన్నారు. మండలంలోని కోనాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూషణరావుపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మక్సూద్ అలీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఆర్థిక అవసరాలపై స్థానిక వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణం తీసుకోకుండా బ్యాంకుల్లో రుణం తీసుకోవాలని తెలిపారు. బ్యాంకులు ప్రజల అవసరాలకు విద్యా రుణం, బంగారు ఆభరణాలపై, గృహ నిర్మాణం, పంటల కోసం రుణాలు ఇస్తాయన్నారు. గడువు తేదీ లోపల రుణం చెల్లిస్తే నిబంధనల మేరకు మరిన్ని అవకాశాలు ఇస్తారన్నారు. పొదుపు చేసిన, సంపాదించిన డబ్బును సేవింగ్స్ ఖాతా, రికరింగ్ ఖాతా, ఫిక్స్డ్ డిపాజిట్ల రూపంలో దాచుకోవచ్చని, ప్రతి విద్యార్థి బ్యాంకులో ఖాతా తీసుకొని ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించాలని వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, తెలియని లింకుల ద్వారా వచ్చే మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్ మార్కెటింగ్

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

అక్షరటుడే, లింగంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో అంజల్ రెడ్డి అన్నారు. లింగంపేట మండల కేంద్రంలోని ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలను శని వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని దస్త్రాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యాబోధన జరుగుతున్న తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను క్షుణ్ణంగా తెలుసుకొని వారికి తగిన విధంగా విద్యాబోధన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమ్మరి సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు యశ్వంత్, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

అక్షరటుడే నిజామాబాద్ క్రైం: పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలిగోట్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు బైకులు, మూడు సెల్‌ఫోన్లు, రూ.10,940 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ తదుపరి విచారణ నిమిత్తం అప్పగించినట్లు సీసీఎస్ ఏసీపీ తెలిపారు.

జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నగరంలోని జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి జీజీహెచ్ ఆవరణలోని షెడ్‌కింద పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడిని ఆస్పత్రిలోకి తీసుకెళ్లి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. అతడి జేబులో ఆస్పత్రి ఓపీ స్లిప్ దొరకగా అతడి పేరు గోపికృష్ణ అంకాపూర్ అని ఉందన్నారు. సరైన ఆధారాలు లేనందున గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడి వివరాలకు వన్‌టౌన్‌లో సంప్రదించాలని కోరారు.

మాలసంఘం భవనం పునర్నిర్మాణానికి నిధులివ్వాలి

అక్షర టుడే, ఆర్మూర్: పట్టణంలోని పోచమ్మగల్లి 13వ వార్డులో అంబేద్కర్ మాల సంఘం శిథిలావస్థలో ఉందని, రూ.15లక్షలతో పునర్నిర్మించాలని మాల సంఘం అధ్యక్షుడు పులి యుగేందర్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి, వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ కోడిగెల మల్లయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ మాల సంఘం ఉపాధ్యక్షుడు వెన్న రమేష్, ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, కార్యనిర్వహణ కార్యదర్శి పింజ సుదర్శన్, కార్యవర్గ సభ్యులు వెన్న మోహన్, కొంతం పూర్ణ చందర్, మాజీ కౌన్సిలర్ ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ వార్షికోత్సవ శోభాయాత్ర

అక్షరటుడే, ఎల్లారెడ్డి: వెల్లుట్ల పేటలో హనుమాన్ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. గ్రామ వీధులన్నీ జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మార్మోగగా, భక్తులు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్ మాట్లాడుతూ.. హనుమాన్ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో మూడు రోజుల పాటు యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో గ్రామ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. శోభాయాత్రలో భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది.

డాక్టర్ కవితారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

అక్షరటుడే, భీమ్‌గల్: ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ సంస్థ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ కవితా రెడ్డిని శనివారం కాంగ్రెస్ బాల్కొండ మండల అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆమె ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమెను జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆరేపల్లి నాగేంద్రబాబుతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. కవితా రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఆరోగ్య రంగం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం ఆమె కృషి చేయాలని కోరారు.